క్లుప్తంగా

అజిత్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న అజిత్ అభిమానులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమిళ సినీనటుడు అజిత్‌కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం ఆ అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరం వినోద్, ఆకాష్, నాని పాల్గొన్నారు.

మే డే వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో మే డే వేడుకలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించారు. స్థానిక డీఐ రోడ్డులో కార్మిక జెండాను బుధవారం ఆ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ ఆవిష్కరించి సభను నిర్వహించారు. కార్మికులు ఆర్థికంగా సిద్ధపడాలంటే వేతనాలు పెరగాలని చెప్పారు. అనంతరం సీనియర్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, మణి, రజినీ, ఆర్ముగం, విజయ్‌కుమార్, ప్రేమ, సుగుణ పాల్గొన్నారు.

కార్మికులకు అన్నదానం



గుడిపాల: మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మే డే సందర్భంగా బుధవారం కార్మికులకు అన్నదానం చేశారు. గుడిపాల సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 250 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కేంద్ర బలగాల కవాతు



ఐరాల: ప్రశాంత వాతవరణంలో ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాలు, పోలీసులతో కలిసి బుధవారం మండలంలోని పి.ఎర్రేపల్లె, నాంపల్లెలో కవాతు నిర్వహించినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికి, ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక కార్యకలపాల నివారణపై ముందస్తు హెచ్చరికలు జారీచేయడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

చంద్రబాబును నమ్మితే నట్టేట ముంచేస్తాడు

ఓటరూ... కాస్త ఆలోచించు

జగనన్న 30 పథకాలు ఇస్తేనే ప్రజలు సోమరిపోతులైపోతున్నారు అన్న చంద్రబాబు.. ఇప్పుడు 177 హామీలు అమలు చేస్తాడా..?



చిత్తూరు: ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

- చంద్రబాబు ఇచ్చేవన్నీ తప్పుడు హామీలు
- ఆ మేనిఫెస్టోను బీజేపీయే నమ్మడం లేదు
- జగనన్నను నమ్మండి.. పథకాలు మళ్లీ ఇంటికే వస్తాయి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి





చిత్తూరు: స్థానికులతో కలిసి ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి, గుడిపాల: వసంతాపురంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ రజినీకాంత్, నాయకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిమ్మిక్కుల చంద్రబాబు మేనిఫెస్టో ఎన్నికలయ్యేంతవరకు అందరికీ చూపిస్తారని, ఆ తరువాత దాన్ని మాయం చేస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత గ్రామంలోని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల పత్రాన్ని అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు జనసేన, బీజేపీలతో జతకట్టారన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపారని చెప్పారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, మోసాలు చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని చెప్పారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇస్తూ, ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు వాటిని నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచడం ఖాయమన్నారు. టీడీపీ మేనిఫెస్టోను వారితో జత కట్టిన బీజేపీ కూడా నమ్మడం లేదని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లో తమ్ముళ్లు సైతం ఓటర్లను బెదిరిస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారని చెప్పారు. వాటికి భయపడాల్సిన పనిలేదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే, కచ్చితంగా వాటిని నెరవేరుస్తారన్నారు. గత ఐదేళ్లలో కష్టానికి, కరోనా విపత్తుకు బెదరకుండా సంక్షేమ ఫలాలను సకాలంలో అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇచ్చి అడుగడుగునా అండగా నిలబడిన జగనన్న మళ్లీ ఆ పథకాలన్నింటినీ కొనసాగిస్తానని మాటిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడిచ్చిన హామీలన్నీ వంద శాతం అమలవుతాయని స్పష్టం చేశారు. ఇందుకు గ్రామస్తులంతా ఫ్యాన్‌కు ఓటేసి జగనన్నను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ త్యాగరాజులు, వైస్ ఎంపీపీ రజనీ, జయరాం, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కుమార్, నంద, సురేష్, జయపాల్‌నాయుడు, మణిబాబుపిళ్లై, వెంకటేష్, రాజేంద్ర, తులసి, ప్రతిమారెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలు ఇచ్చే బాబుమనకొద్దు

తప్పుడు హామీలు ఇచ్చే బాబు మనకొద్దన్ని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో బుధవారం రాత్రి మండల నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధాల కోరు అని, ప్రజలను మోసం చేయడంలో దిట్టన్నారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబుకు సాటెవ్వరూలేదన్నారు. వెన్నుపోటు రాజకీయాలు బాబుకు వెన్నెతో పెట్టిన విద్యన్నారు. జగనన్న అధికారంలోకి వస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, సంక్షేమానికి కొదవలేదన్నారు. ఇందుకు సాక్ష్యమే ఈ ఐదేళ్ల పాలనఅని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు సంపత్, సుధీర్‌రెడ్డి, ధర్మారెడ్డి, రవి, అనీష్, ప్రభాకర్, జాన్, పరంధామయ్య నాయుడు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, రాష్ట్రానికి మేలు చేసే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు రావూరి ఈశ్వరావ్ అన్నారు. చిత్తూరు మండలం దిగువమాసపల్లె పంచాయతీలో బుధవారం రాత్రి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీనవర్గాలను తోసిపుచ్చారన్నారు. వారిని ఓట్ బ్యాంక్ కోసం వాడుకున్నారని దుయ్యబట్టారు. కానీ టీడీపీలో కీలకనేతగా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆ పార్టీలో తనకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. బడుగు, బలహీనవర్గాలకు జగనన్న అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. పార్టీ, నామినెటెడ్ పదవులతో పాటు సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక శాతం లబ్ధి పొందారని వివరించారు. అటువంటి నాయకుడు మళ్లీ వస్తే ఖచ్చితంగా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాబర్ట్, ప్రభాకర్, సుబ్రమణ్యం, శంకర్, పీఎస్‌రెడ్డి, కట్టమంచి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గత హామీలకే దిక్కులేదు

చిత్తూరు కార్పొరేషన్: గత ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి తప్పుడు వాగ్దానాలు ఇచ్చి గద్దెనెక్కి వాటిని నెరవేర్చలేదు కానీ ఇప్పుడు కొత్తగా హామీలు గుప్పించిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక పూనేపల్లెలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదలకు పెత్తందార్లకు యుద్ధం జరుగుతోందని, ఇందులో భాగంగా పేదల వైపు సీఎం జగనన్న ఉన్నారని, పెత్తందార్లకు కూటమి మద్దతుగా ఉంటుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత వరకు ప్రజలకు చెప్పింది చేసిన ఏకైక సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఆయన్ను ఎదుర్కొనలేక చంద్రబాబు కుట్రపూరితంగా బీజేపీ, జనసేనలతో పొత్తు పెట్టుకుందన్నారు. ఓ వైపు వెన్నుపోటు పొడిచిన మామ ఫొటో, మరో వైపు పవన్‌కల్యాణ్, మోదీ ఫోటోలను అడ్డం పెట్టుకుని ఎన్నికలకు వస్తున్నాడని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ నవీన్‌కుమార్, నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

రానున్న ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కొంగారెడ్డిపల్లె నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఓటర్లతో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి గత ఐదు సంవత్సరాల్లో జరిగిన మేలును తెలియజేశారు. కరోనాలాంటి సంక్షోభ సమయంలో సంక్షేమం అందించిన వారిని ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజులు, చంద్రశేఖర్ ఆచ్చారి, ఎం.సురేష్, రాజేంద్ర, మురకంబట్టులో కార్పొరేటర్ నవీన్, దొడ్డిపల్లెలో కార్పొరేటర్ సునీత, నాయకులు ప్రసాద్‌రెడ్డి, టెలిఫోన్‌కాలనీలో నగర యువత అధ్యక్షుడు డీసీ మనోజ్‌రెడ్డి, కార్పొరేటర్ సయ్యద్ నాయకులు బాలాజీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన మళ్లీ తెచ్చుకుందాం



చిత్తూరు: మురకంబట్టులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నవీన్



చిత్తూరు: కొంగారెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి



చిత్తూరు: దొడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సునీత

గుడిపాల: సంక్షేమ పథకాలను గడప వద్దకే తెచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని నంగమంగళం, రామభద్రాపురం, వసంతాపురం, నారగల్లు, నంగమంగళం, బసవాపల్లె, పేయనపల్లె, గట్రాళ్లమిట్ట పంచాయతీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు జయకోడి, రజినీకాంత్, మోహన్ నాయుడు, సుధాకర్‌నాయుడు, ఎంపీటీసీలు సామువేల్, డానియల్,వైఎస్సార్‌సీపీ నాయకులు కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సాయిక్రిష్ణ, సూరి, నవీన్, గుండుసాయి, శిలంబరసన్‌లతో పాటు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.









చిత్తూరు: వృద్ధురాలితో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, దిగువమాసపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు, తాళంబేడులో ప్రచారం చేస్తున్న మండల నాయకులు, టెలిఫోన్‌కాలనీలో ఓట్లడుగుతున్న కార్పొరేటర్ సయ్యద్, నాయకులు









గుడిపాల: నంగమంగళంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రామభద్రాపురం పంచాయతీలో నేతల ప్రచారం, నారగల్లులో ఓటడుగుతున్న సర్పంచ్, ఎంపీటీసీ, బసవాపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వ్యర్థాలు తొలగించి మొక్కలు నాటారు



చెత్త చెదారంతో నిండిన ప్రాంతం



మొక్క నాటుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: వ్యర్థాలతో నిండిన ప్రాంతాలను శుభ్రం చేసి పచ్చని మొక్కలు నాటారు నగర పాలక అధికారులు. కొంగారెడ్డిపల్లి పూల మార్కెట్ వద్ద వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో నగర కమిషనర్ అరుణ ఆదేశాల మేరకు పూల మార్కెట్ వద్దనున్న ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణకు నగరపాలక అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆ ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రపరిచి మొక్కలు నాటారు. మొక్కలకు రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. ఎంహెచ్‌ఓ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తడి, పొడిగా వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మైనారిటీల ఆదరణ మరువలేనిది

చిత్తూరు కార్పొరేషన్: మొదటి నుంచి మైనారిటీలు వైఎస్సార్‌సీపీపై చూపుతున్న ఆదరణ మరువలేనిదని ఆ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక బజారువీధిలో బుధవారం నిర్వహించిన మైనారిటీల ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింలకు చంద్రబాబు ఒక మంత్రి పదవి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. వారిని ఓటు బ్యాంకులాగా వాడుకోవడం తప్పితే, వారికి చేసిన మేలు ఏమీ లేదన్నారు. అదే జగనన్న మైనారిటీలకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో నియోజకవర్గంలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫా అందించినట్లు గుర్తు చేశారు. తనవంతు సాయంగా మసీదు అభివృద్ధికి నిధులు, షాదీమహాల్‌ను అభివృద్ధి చేశానన్నారు. అనంతరం డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తొలుత శాంతి కపోతాలను పైకి ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు చాన్‌బాషా, గఫార్‌ఖాన్, వెంకటేష్, ఆను, సీతాపతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శాంతికపోతాలను ఎగురువేసిన విజయానందరెడ్డి

ఇంటివద్దే పింఛన్ పంపిణీ

చిత్తూరు అర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నగర కమిషనర్ అరుణ పర్యవేక్షించారు. నగరంలోని 33, 34 వార్డు పరిధిలో బుధవారం ఉదయం డోర్ టు డోర్ పింఛను పంపిణీ కార్యక్రమం జరుగుతున్న తీరును కమిషనర్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్మును అందించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో మొత్తం 16,627 పింఛన్లకు గాను, 11,587 పింఛన్లను డీబీటీ విధానంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. మిగిలిన 5,040 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించినట్లు తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో వార్డు అడ్మిన్, వెల్ఫేర్, ఇతర కార్యదర్శుల ద్వారా ఉదయం 6 గంటల నుంచే క్లస్టర్ వారీగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించారన్నారు. 92 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాలకు జమచేసిన పింఛన్లకు సంబంధించి సమాచారాన్ని ఇప్పటికే సంబంధిత లబ్ధిదారులకు ఫోన్ ద్వారా, స్వయంగా తెలియజేశారన్నారు. ఏదైనా కారణాలతో నగదు బ్యాంకులో జమకాని పక్షంలో అలాంటి వారికి 3వ తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్ల అందిస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, సీవోలు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ పరిశీలనలో నగర కమిషనర్

పైసా కొట్టు.. ఫాలోవర్లను పట్టు!



- ఎన్నికల వేళ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- తాత్కాలికంగా సోషల్ స్ట్రాటజిస్టులు నియామకం

చిత్తూరు కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలకు డబ్బులిస్తే వేల సంఖ్యలో జనం హాజరు కావడం సాధారణం. అదే సోషల్ మీడియాలో ఫాలోవర్లను పెంచుకుంటే ఒక్క పోస్టుతో వేలు, లక్షల మందిని చేరుకోవచ్చు. అయితే ఇప్పటికిప్పుడు వ్యక్తిగత ఖాతా/పేజీ తెరిచి ఫాలోవర్లు పెరిగే వరకు ఎదురు చూడటం సుదీర్ఘ ప్రక్రియ. ఇవేవీ లేకుండా పైసా కొడితే వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవర్లను తెచ్చి పెట్టే విధానం అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉండే సోషల్ మీడియా పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవరు రూ.3 నుంచి రూ.5 వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల వేళ వీటికి భలే డిమాండ్ ఉందని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

అందరికీ చేరువే లక్ష్యం

ఎన్నికల బరిలో నిలబడాలనుకునే అభ్యర్థులు పైచేయి సాధించాలని భావిస్తారు. ఈ సమయంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సంబంధాలు పెంచుకునేందుకు హోర్డింగులు, ఫ్లెక్సీలతో ప్రకటనలు గుప్పించడం ఒకెత్తు. సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో అందరికీ చేరువై తటస్థ ఓటర్లను ఆకర్షించడం మరో ఎత్తు. ఈ తరహా ప్రచారంపై రాష్ట్ర స్థాయి నేతలే కాదు.. నియోజకవర్గ స్థాయి నేతలూ గురి పెట్టారు. బహుళ ప్రజాదరణ పొంది, లక్షల్లో ఫాలోవర్లు ఉండే పేజీలను డబ్బులిచ్చి కొనుగోలు చేస్తున్నారు. తాత్కాలికంగా సోషల్ స్ట్రాటజిస్టులను నియమించుకుంటున్నారు.

వీళ్లకు భలే డిమాండ్

ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ ఉంది. వీరిని వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకుంటున్నారు. ఎన్నికలకు అనుగుణం గా ఎప్పటికప్పుడు పర్యటనలు, ప్రసంగాలు, నియోజవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునేలా పోస్టులు చేయడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇలా వ్యూహకర్తలను అందించేందుకు ఇటీవల ప్రత్యేకంగా కన్సల్టెన్సీలు ఏర్పాటైనట్లు సమాచారం.

లక్షల్లో ఫాలోవర్లు

సోషల్ మీడియాలో పోస్టులు, అందులో ఉండే కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది అనుసరిస్తారు. ఉదాహరణకు కొందరు ఫేస్బుక్, ఇన్‌స్టాగామ్ పేజీ ప్రారంభిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలకు చేరువయ్యే పేరుతో ఇవి మొదలవుతాయి. అడ్మిన్లు ఈ పేజీలో రాష్ట్రవ్యాప్తంగా వర్తమాన రాజకీయాలకు సంబంధించిన పోస్టులు, నేతల ప్రసంగాల వీడియోలు, కార్టూన్లు నిత్యం పోస్టు చేస్తుంటారు. నెలల వ్యవధిలో ఫాలోవర్ల సంఖ్య లక్షల్లోకి చేరుతుంది. ఫాలోవర్లు బాగా పెరిగాక అడ్మిన్లను తొలగిస్తారు. ఒక్కో ఫాలోవర్‌కు వేలల్లో ధర నిర్ణయిస్తారు. ఎవరైనా ఈ డబ్బులు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీదకు మార్చేస్తారు.

సామాజిక మాధ్యమాల్లో ముందస్తుగా

కొందరు నేతలు సోషల్ మీడియాల్లో సొంతంగా ఖాతాలు తెరిచి ముందస్తుగా ప్రకటనలు ఇస్తున్నారు. నిర్ణీత రుసుముతో ఫేస్బుక్, ఇన్‌స్టాగామ్‌లో ఈ వ్యవస్థ అందుబాటులో ఉంది. యూట్యూబ్ తరహాలో ఈ ప్రకటనలు ఖాతాదారులందరికీ వస్తాయి. రీల్స్, పోస్టులు చూస్తున్నప్పుడు వివిధ రాజకీయ అభ్యర్థుల ప్రకటనలు విరివిగా వస్తాయి. ఆయా అభ్యర్థుల ఖాతాలను ఫాలోకాకున్నా ప్రకటనలు కనిపిస్తాయి.